# అచ్చర ఇజయం

ఎన్నికలు దగ్గరపడ్డాయి. టిక్కెట్టు లేని ప్రయాణికుల జాబితాలో చేరి తిరుగుబాటు అభ్యర్థిగా నామినేషన్ వేస్తే ప్రమాదం అని మళ్ళీ ప్రస్తుత శాసనసభ్యునికే టిక్కెట్టిచ్చేరు.

అయితే అతన్ని గతంలో గెలిపించిన నియోజకవర్గపు గ్రామస్థులు తిరగబడ్డారు. ఛస్తే మళ్ళీ ఆ ఎమ్మెల్యేకి ఓటు వెయ్యబోమని మొరాయించుక్కూచున్నారు. ఈ విషయం, పాలేరు ద్వారా ఆ ఎమ్మెల్యేగారికి తెలిసిపోయింది.

"వాళ్లకి అఆలు నేర్పకపోతే మనకు ఓటెయ్యర్రా! అఆలు నేర్పాలి" అన్నారు ఎమ్మెల్యేగారు.

"అదేటి బాబయ్యా! అల్లెప్పుడో అచ్చర ఇజయంతో రేత్తిర్లు బడికెల్లి అఆలు నేర్చీసుకున్నారండయ్యగోరూ!" అన్నాడు పాలేరు.

"అదికాదురా వెర్రిమొగమా! వాళ్లందుకనే తెలివిమీరేరు. మనం వాళ్లకి వేరే అఆలు నేర్పాలి" అన్నారు ఎమ్మెల్యేగారు.

అనేసి మర్నాడు రాష్ట్ర రాజధానికి వెళ్ళిపోయారు.

రెండ్రోజులు పోయాక ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా వున్న ఓ ఊళ్లో ప్రమాదవశాత్తు పేదల గుడిసెలు తగలబడిపోయాయి పాపం! కట్టుబట్టల్తో రోడ్డుమీద పడ్డారు ప్రజలు. అసలే వేసని మండిపోతోంది కూడాను.

ఈ విషయం ఎమ్మెల్యేగారికి ఫోన్‌ద్వారా తెలిసి ఆయన గుండె తరుక్కుపోయింది. తన నియోజక వర్గ ప్రజలు కష్టాల పాలు కావడమా? వీల్లేదు.

హుటాహుటిన ఓ లారీతో సహా బయలు దేరి ఆ గ్రామప్రజల్ని పరామర్శించి,

పంచెలు, చీరలు, దుప్పట్లు పంచిపెట్టారు. వందుకుందికి బియ్యం, పప్పుధాన్యాలు, పాత్ర సామాన్లు ఇచ్చారు.

ఆ సంగతెలిసి ఆ ఎమ్మెల్యేగారు ఆ గ్రామప్రజల దృష్టిలోనేకాక నియోజకవర్గం మొత్తం ధర్మప్రభువైపోయారు. మళ్ళీ ఆయనకే అఖండ విజయం చేకూర్చారు జనం.

"ఇప్పుడు తెలిసిందిరా అఆలు నేర్పడం అంటే ఏంటో?" అన్నారు ఎమ్మెల్యేగారు హైదరాబాద్ బయలుదేరేముందు నిదానంగా మీసాలు మెలేస్తూ.

"తెల్దు బాబాయ్యా!" అన్నాడు పాలేరు.

"అ అంటే అగ్గెట్టేయ్ అనీ

ఆ అంటే ఆదుకో! అనీ అర్థంరా వెర్రిమొగమా" అన్నారు ఎమ్మెల్యేగారు.

**చతుర ఆగస్టు 1998**